క్లుప్తంగా

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ



మద్దూరు: కొత్తపల్లి మండలంలోని నిడ్జింత ఉన్నత పాఠశాల విద్యార్థులకు కోరమండల్ ఇంటర్నెనల్ లిమిటెడ్ చెందిన మన గ్రోమోర్ సెంటర్ ఆధ్వర్యంలో 300మంది విద్యార్థులకు శనివారం ప్లేట్లను పంపిణీ చేశారు. ఈ మేరకు.. పాఠశాల హెచ్‌ఎం ఆంజనేయులు మాట్లాడుతూ.. ఈ సంస్థ తరుపున విద్యార్థులకు ప్లేట్స్ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంస్థ మేనేజర్ క్రాంతికుమార్, ఏఓ రామకృష్ణ, సిబ్బంది సురేష్, మహదేవ్, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరికి మద్దతు ధర ప్రకటించాలి

కృష్ణా: అధికార కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల సమయంలో రైతుల వరిపంటకు మద్దతు ధర అందిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని టీడీపీ పార్లమెంటరీ జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం వరి పంటకు మద్దతు ధర 2200లతోపాటు 500లు బోనస్‌తో కలిపి 2700లు అందించాలని ఆయన కోరారు. ఇచ్చిన హామీని కాంగ్రెస్ నెరవేర్చకపోతే తాము రైతుల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



మద్దూరు: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్ద వాగునుంచి కొమ్మూరు గ్రామానికి చెందిన వారు ఏలాంటి అనుమతులు లేకుండా శుక్రవారం అర్ధరాత్రి అక్రమంగా ఇసుకను నాలుగు ట్రాక్టర్లలో తరలిస్తున్నారని పోలీసులకు సమాచారం అందడంతో వారు అక్కడి చేరుకొని ట్రాక్టర్లను పట్టుకునే క్రమంలో ట్రాక్టర్లను వదిలి వెళ్లారు. పోలీసులు వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి ట్రాక్టర్ల నంబర్లపై కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ రాంలాల్ శనివారం తెలిపారు.

నర్వ స్టేషన్‌లో



నర్వ: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం తెల్లవారు జామున పట్టుకున్నట్లు ఎస్‌ఐ కురుమయ్య తెలిపారు. వివరాలిలా.. ఎల్లంపల్లికి చెందిన ట్రాక్టర్ అక్రమంగా వాగు నుంచి ఇసుకను తరలించారన్నారు. ఈ సందర్భంగా నమ్మదగిన సమాచారం మేరకు ట్రాక్టర్‌ను పట్టుకుని డ్రైవర్ ఉంద్యాల గోపాల్‌తో ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించామన్నారు. ట్రాక్టర్‌ను సీజచేసి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు సింగిల్ విండో సర్వసభ్య సమావేశం

నర్వ: నేడు సింగిల్ విండో సర్వసభ్య సమావేశం ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆదివారం నిర్వహించే ఈ సమావేశానికి మండలంలోని సొసైటీ గ్రామాల సభ్యులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో గత ఆరునెలల ఖర్చు, ఆమోదించుట, వచ్చే ఆరు నెలల బడ్జెట్ ఆమోదించుటకు సొసైటీ సభ్యులు, రైతుల సమక్షంలో ప్రతిపాదిస్తామన్నారు. ఈ సమావేశానికి విధిగా హాజరు కావాలన్నారు.

అందరూ సుఖసంతోషాలతో ఉండాలి

మహబూబ్‌నగర్ రూరల్: ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఫతేపూర్‌లో బొడ్రాయి పండుగలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భూదేవి శ్రీదేవి సమేత వేంకటేశ్వర స్వామి, కొండపై వెలసిన రామలింగేశ్వర స్వామిని దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, సుధాకర్‌రెడ్డి, భాస్కర్, చెన్నయ్య, పాండు, నర్సింహ, నరేష్, నాయక్ పాల్గొన్నారు.

హాజరైన ఎంపీ, మాజీ మంత్రి

బొడ్రాయి పండుగలో ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. ప్రజలందరితో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు చాలా గొప్పవని చెప్పారు. తమ గ్రామానికి ఎలాంటి అరిష్టం జరగొద్దని, పాడి పంటలతో సంతోషంగా ఉండాలని ప్రజలందరూ గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని తెలిపారు. ఎంపీ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చెప్పిన తప్పుడు వాగ్దానాలను నమ్మి ప్రజలు ఓటు వేశారని అన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను ప్రభుత్వం మోసం చేస్తుందని అన్నారు.

వరికి సాగునీటి కష్టాలు

- అడుగంటుతున్న బోర్లు
- ఎండిపోతున్న పంటలు
- కొత్తగా బోర్లు వేసినా చుక్కనీరు లభించని వైనం



చుక్క నీరు పడని కొత్తగా వేసిన బోరు (ఫైల్)



దామరగిద్ద లో నెర్రెలు వారిన పొలాన్ని చూపిస్తున్న రైతు పకిరప్ప (ఫైల్)

దామరగిద్ద: యాసంగిలో వరి సాగు చేసిన రైతన్నకు సాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. ఈ ఏడాది సాధారణ వర్షాలు మాత్రమే కురియడంతో యాసంగి పంటల సాగులో ప్రధానంగా వరిసాగుచేసిన రైతులకు నీరు సరిపడక వరి మడులు బీటలు వారాయి. వరి పంటతోపాటు వ్యవసాయ ఆధారితంగా పాడిపశువులు, మేకలు, గొర్రెలను పోసిస్తూ జీవనం సాగిస్తున్న రైతులు సైతం ప్రధాన వనరుగా ఉన్న భూగర్భజలాలు అడుగంటి బోర్లు ఎండిపోవడంతో తాగునీరు దొరకని పరిస్థితి నెలకొంది.

మరో నెలరోజుల్లో పంటలు చేతికందే సమయంలో బోర్లు ఎండి చుక్కనీరు అందక ఏం చేయాలో తెలియని దుస్థితితో రైతులు ఆవేదన చెందుతున్నారు. కొందరు ఎలాగైనా పంటను కాపాడుకోవాలని ట్రాక్టర్ల ద్వారా ట్యాంకర్లతో నీటిని దూర ప్రాంతాల నుంచి తరలించి పంటలను తడుపుతు బతికించుకుంటున్నారు. మరికొందరు రైతులు ఎండిన పంటలను పశుగ్రాసంగా పశువులను మేపుతున్నారు.

ఎకరాకు 20వేలకు పైగా పెట్టుబడి

ఇప్పటికే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కలుపు మందులు తదితర సాగు ఖర్చులతో ఎకరాకు రూ. 20వేలకు పైగా పెట్టుబడులు పెట్టిన రైతులకు సాగునీటి కొరతతో పంటలకు నీరందక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

12వేల ఎకరాల్లో వరిసాగు..

మండలంలో గతఖరీఫ్ 14వేల ఎకరాల్లో సాగుచేయగా సాధారణ వర్షాలు మాత్రమే కురియడంతో యాసంగి వరిసాగు విస్తీర్ణాన్ని తగ్గించుకున్నారు. 23రెవెన్యూ గ్రామాల పరిధిలోని 8క్లస్టర్లలో 6వేలకు పైగా మంది రైతులు వరిసాగును దాదాపు 30శాతం తగ్గించుకోవడంతో సాగు విస్తీర్ణాన్ని 12వేల ఎకరాలకు తగ్గింది. పంటకాలం 120రోజులు కాగా చలికాలంలో నారు మడులు ఆలస్యంగా నాటుకు రావడంతో వెనక ముందు సాగుచేసిన రైతుల పంటలు 90–110 రోజులు దశలో ఉన్నాయి. చిరుపొట్ట దశలో, పాలు పోసే, గింజపట్టే దశలో ఉన్న పంటలకు సరిపడా నీరందక పంటలు ఎండిపోతున్నాయి.

కొత్తగా బోరువేసిన నీళ్లు రాలేదు..



తనకు ఉన్న ఒక్క బోరు కింది ఎకరం పొలంలో వరిసాగు చేశాను. బోరులో నీళ్ల తగ్గడంతో లక్ష రూపాయల ఖర్చుతో కొత్తగా బోరు వేసిన చుక్కనీరు పడలేదు. పంటకు సాగునీరందక ఎండిపోతుండటంతో కొత్తగా బోర్లు వేసిన లక్షల్లో నష్టపోయాం. ప్రభుత్వం నష్టపోయిన వరి రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలి.

- శాసర్‌పల్లి పకిరప్ప, రైతు దామరగిద్ద

రెండెకరాలు ఎండిపోయింది..



రెండు బోర్లకింద రెండెకరాల పొలంలో వరిసాగు చేశాను. నాటు వేసిన నెలరోజులకే ఓ బోరు పూర్తిగా ఎండిపోయింది. ఉన్న ఒక్క బోరు ఆగి ఆగి నీటిని పోస్తుంది. దీంతో రెండెకరాల పొలంలో ఇప్పటికే ఎకరన్నర వరి పొలం పూర్తిగా బీటలు వారి చేతికొచ్చిన పంట పశువులను మేపుతున్నాం. ఎకరాకు రూ 20వేల చొప్పున 40వేలు పెట్టుబడులు నేల పాలయ్యాయి. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

- క్యాసారం గోవింద్‌రెడ్డి, రైతు, దామరగిద్ద

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు రాజవర్ధన్‌రెడ్డి

మద్దూరు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ పార్లమెంట్ ఎన్నికల నియోజకవర్గ ఇన్‌చార్జి రాజవర్ధన్‌రెడ్డి కార్యకర్తలకు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఓ పంక్షన్ హాల్‌లో బూత్‌స్థాయి శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు, మండల కమిటీ సభ్యులతో విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి డీకే అరుణను భారీ మెజార్టీతో గెలిపించాలని, ప్రతి ఒక్కరూ ప్రధాని మోదీ చేపట్టినా సంక్షేమాభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మదన్, రమేష్, నర్సింహులు, ప్రతాప్‌రెడ్డి, రాము, శంకర్, సుధాకర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, వెంకటయ్య, కేశవరెడ్డి, సాయిలు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ ప్రతి ఉద్యోగికి సర్వసాధారణం



ఎంపీడీఓను సన్మానిస్తున్న అధికారులు

మాగనూర్: ఉద్యోగ వృత్తిలో పదవీ విరమణ ప్రతి ఉద్యోగికి సర్వ సాధారణమని జెడ్పీటీసీ వెంకటయ్య అన్నారు. మండల ఎంపీడీఓకు బాధ్యతలు నిర్వహిస్తున్న పదవీకాలం ముగియడంతో పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ దంపతులకు సన్మానించారు. అనంతరం జెడ్పీటీసీ మాట్లాడుతూ.. పదవీ విరమణ వయస్సుకు కానీ వృత్తికి కాదని అన్నారు. మండలంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్య పరిష్కారానికి ఎల్లవేళల కృషిచేసిన ఎంపీడీఓను కొనియడారు. అనంతరం ఎంపీడీఓ శశికళ తోటి ఉద్యోగులకు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్యామలమ్మ, తహసీల్దార్ సతీష్‌కుమార్, ఎంపీఓ జైపాల్ రెడ్డి, వైస్ ఎంపీపీ తిప్పయ్య, జూనియర్ అసిస్టెంట్ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, ఏపీఓలు తదితరులు పాల్గొన్నారు.

భక్తిమార్గంలో నడవడం అభినందనీయం



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

నారాయణపేట: రంజాన్ మాసంలో ముస్లింలు కఠోర దీక్షలు చేపట్టి భక్తి మార్గంలో నడవడం అభినందనీయమని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని హజిఖాన్‌పేటలో శివన్న సైన్యం యువనాయకుడు కాంట్రాక్టర్ గొల్ల రవి ఆధ్వర్యంలో ఇఫ్తార్‌విందు ఇచ్చారు. ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలుచేసి ఉపవాస దీక్షలను విరమించారు. కౌన్సిలర్ సరిత, మాజీ మార్కెట్ చైర్మన్లు బండి వేణుగోపాల్, సుధాకర్, జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు ఎల్.మనోహర్‌ప్రసాద్‌గౌడ్, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల వేతనాలు చెల్లించాలి



నారాయణపేటలో ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న నాయకులు



కృష్ణాలో ఎంపీడీఓ చక్రపాణికి వినపత్రం ఇస్తున్న కార్మికులు

నారాయణపేట రూరల్ : గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలను వెంటనే చెల్లించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి నర్సింహ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వినతిపత్రం అందించి మాట్లాడారు. చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారని, వేతన సవరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటయ్య, రాంచందర్, చందు, మల్లేష్, రఘు, శ్రీను పాల్గొన్నారు.

కోస్గి: గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించాలని పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు రాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక ఎంపీడీఓకు వినతి పత్రం అందజేశారు. జిల్లాలో సుమారు వెయ్యిమంది కార్మికులకు గత ఏడునెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. కనీస వేతనాలకు నోచుకోకుండా పని చేస్తున్న కార్మికులకు ఇచ్చే అరకొర వేతనాలైన సక్రమంగా అందించాలన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీఓకు అందించారు. సంఘం నాయకులు చెన్నయ్య, వెంకటయ్య, మొగులయ్య, తిర్మలయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను చెల్లించాలని కోరుతూ శనివారం ఐఎఫ్‌టీయూ నాయకులు ఇన్‌చార్జి ఎంపీడీఓ చక్రపాణికి వినతి ప్రతాన్ని అందించారు. ఈ మేరకు.. ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధక్షుడు ఏజీ బుటో మాట్లాడుతూ.. ఆరు నెలలుగా ప్రభుత్వం కార్మికులకు వేతనాలను అందించకపోవడంతో వారి కు టుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాయని, ఈ విషయంలో ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకుని వారి వేతనాలను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక అధ్యక్షుడు మహాదేవ్, వెంకటేష్, మహాదేవప్ప తదితరులు పాల్గొన్నారు.



కోస్గిలో..

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



మాగనూర్: వేసవి కాలం ప్రారంభం కావడతో మండలంలో నెలకొన్న తాగునీటి ఎద్దడి పరిష్కారానికి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవ చూపారు. శనివారం మండల కేంద్రంలో రెండు బోర్లు వేయించారు. రెండు బోర్లు తాగునీటి పడటంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ మాట్లాడుతూ.. మండల కేంద్రంలో ప్రధానంగా తాగునీటి సమస్య ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించి హామీఇచ్చారన్నారు. ఈ ప్రాంత నీటి సమస్యను తీర్చినందుకు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నరసింహారెడ్డి, కృష్ణయ్య, వాకిటి శ్రీనివాసులు, దండు ఆనంద్, బాలు, వేణుగౌడ్, వేణుగోపాల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి నిదర్శనం..!

నారాయణపేట రూరల్ : ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యానికి ఈ చిత్రం నిదర్శనంగా నిలుస్తుంది. బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సులు నిలిపాల్సిన ప్లాట్ ఫామ్‌లపై ప్రైవేట్ వాహనాలు ఇష్టారితిగా పార్కింగ్ చేస్తున్నారు. ఒక పక్క ద్విచక్రవాహనదారులు ఎక్కడ పడితే నిలిపితే.. మరో పక్క ఆటో, జీపులు ఏకంగా ప్లాట్‌ఫామ్‌పైకి వచ్చి ప్యాసింజర్లను తీసుకుని వెళ్తున్నారు. ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆర్టీసీ అధికారులు తమ వ్యవహారశైలి మార్చుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



రోడ్డుపై అడ్డంగా నిలిచిపోయిన సిమెంట్ లారీ

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలో నిత్యం రద్దీగా ఉండే ప్రధాన చౌరస్తాలో ఓ సిమెంట్ లారీ అడ్డంగా నిలిచిపోవడంతో ట్రాపిక్ అంతరాయం కల్గింది. వివరాల్లోకి వెళ్తే.. కర్ణాటక రాష్ట్రం నుంచి శనివారం ఉదయం 7:30గంటల సమయంలో పట్టణంలోకి ప్రవేశించిన సిమెంట్‌లారీ స్థానిక శ్రీ సత్యనారాయణ చౌరస్తాలో యూ టర్న్ తీసుకునేందుకు డ్రైవర్ ప్రయత్నించాడు. ఈ క్రమంలో ముందు చక్రాల వద్ద రాడ్ ఊడిపోవడంతో లారీ రోడ్డుపై అడ్డంగా నిలిచిపోయింది. దీంతో అంతరాష్ట్ర రహదారిపై రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కల్గింది. మరమ్మతులు చేయడానికి సుమారు 3గంటలపైగా సమయం కావడంతో టెన్త్ పరీక్షకు వెళ్లే విద్యార్థులతోపాటు ఉద్యోగ, వ్యాపారుల వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ట్రాఫిక్ పోలీసులు సైతం సిగ్నలింగ్ వ్యవస్థను నిలిపి మ్యాన్‌వల్‌గా ట్రాఫిక్‌ను సవరించారు.



శ్రీసత్యనారాయణచౌరస్తాలో ట్రాఫిక్ జాం

ఓటుహక్కును వినియోగించుకోవాలి



కోస్గిలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న ప్రత్యేక బలగాలు

కోస్గి: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం వంటిదని, ప్రజలు తమ ఓటు హక్కును ధైర్యంగా వినియోగించుకోవాలని ఎస్‌ఐ శేఖర్‌గౌడ్ సూచించారు. ఈ మేరకు శనివారం గుండుమాల్ మండలంలోని సమస్యాత్మకమైన హన్మాన్‌పల్లి, మీర్జాపూర్ గ్రామాల్లో పోలీసులు, కేంద్ర ప్రత్యేక బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణ కోసమే పోలీసుశాఖ ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తుందని సూచించారు. ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో మనో ధైర్యం కల్పించడంతోపాటు ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే లక్ష్యంగా ఇలాంటి ప్రదర్శనలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ మేరకు ఆయా గ్రామాల్లో ప్రత్యేక పోలీస్ బలగాలతో పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌ఏఎఫ్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మక్తల్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం వంటిదని, ప్రజలు తమ ఓటు హక్కును ధైర్యంగా వినియోగించుకోవాలని ఎస్‌ఐ భాగ్యలక్ష్మిరెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం మండలంలోని సమస్యాత్మకమైన పంచదేవ్‌పాడు, చిట్యాల గ్రామాల్లో పోలీసులు, కేంద్ర ప్రత్యేక బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణ కోసమే పోలీసుశాఖ ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తుందని సూచించారు. అనంతరం గ్రామాల్లో భారీ ర్యాలీ నిర్వహించారు.

ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు



మక్తల్‌లో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థినులు

మక్తల్: పట్టణంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలల్లో వారం రోజుల పాటు నిర్వహించిన పదవ తరగతి పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజు సాంఘిక శాస్త్రం పరీక్షకు 1275మందిగాను ఆరుగురు విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైయ్యారు. ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్‌ఐ లక్ష్మిరెడ్డి ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రాల బందోబస్తు ఏర్పాటు చేశారు.

మాగనూర్: మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రాలల్లో వారం రోజుల పాటు నిర్వహించిన పదవ తరగతి పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజు నిమిషం ఆలస్యం నిబంధన అమలులో ఉండటంతో పరీక్ష కేంద్రానికి విద్యార్థులు గంట ముందే చేరుకున్నారు. చివరి రోజు సాంఘిక శాస్త్రం పరీక్షకు 222మందివిద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు ఎగ్జామ్ సూపరింటెండెంట్ నాగార్జున తెలిపారు. ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా ముగియడంతో ఇటు అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు

ధన్వాడ: మండలంలో కొనసాగుతున్న పదోతరగతి పరీక్షలు శనివారంతో ముగిశాయి. ప్రశాంతంగా పరీక్షలు రాసి విద్యార్థులు తమ ఇండ్లకు ప్రయాణమైయ్యారు. మొత్తం మండలంలో కొండాపూర్ పాఠశాల, తెలంగాణ మోడల్ పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలను నిర్వహించారు. పరీక్షల అనంతరం తల్లితండ్రులు వచ్చి తమ పిల్లలను ఇండ్లకు తీసుకుని వెళ్లారు.



ధన్వాడలో..



మాగనూర్‌లో

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..



విద్యార్థులతో ఉపాధ్యాయులు

మాగనూర్: మండల పరిధిలోని గురువలింగంపల్లి మండల ప్రాథమికొన్నత పాఠశాల విద్యార్థులు శనివారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారితోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం చక్కగా బోధించిన వారికి ఉపాధ్యాయులు బహుమతులు అందించారు. పాఠశాల హెచ్‌ఎం బలరాం మాట్లాడుతూ.. ఉన్నత విలువలను చిన్నతనం నుంచే అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ కిష్టయ్యగౌడ్, గ్రామస్తులు రఘు, నరేష్, నర్సింహులు, వీవీ శివాజీ తదితరులు పాల్గొన్నారు.

పౌరసేవలపై అవగాహన

అమరచింత: రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులు, సేవలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండి, వాటిని వినియోగించుకోవాలని ఆర్‌ఐ గోపాల్, ఏఎస్‌ఐ వెంకట్ రెడ్డి అన్నారు. మండలంలోని నందిమళ్లలో శనివారం సివిల్స్ రైట్‌డే కార్యక్రమం సందర్భంగా గ్రామ ప్రజలకు పౌరసేవలపై అవగాహన కల్పించారు. గ్రామంలో ప్రభుత్వ ఆస్తుల సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాలను ప్రజల ఆస్తులుగా భావించి అవి అన్యాక్రాంతం కాకుండా కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రామంలో నేరాల నియంత్రణ కోసం ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

ఎమ్మెల్యేకు చిత్రపటం అందజేత



అమరచింత: మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చిత్రపటాన్ని పెన్సిల్‌తో గీసి, దాని ఫ్రేమ్‌ను శనివారం ఎమ్మెల్యేకు అమరచింతకు చెందిన ప్రవళిక అందించింది. పట్టణానికి చెందిన నామాల ప్రవళికకు చిత్రలేఖనంపై ఆశక్తి ఉండటంతో పలు దేశ నాయకుల చిత్రపటాలతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకుల చిత్రపటాలను పెన్సిల్‌తో వేయడంలో అందేవేసిన చెయ్యి. ఈక్రమంలో మక్తల్ నియోజక వర్గంలో బీసీ వర్గం నుంచి మొదటి సారిగా ఎమ్మెల్యేగా గెలిచి రికార్డు సృష్టించిన వాకిటి శ్రీహరి చిత్రపటం గీసి బహుకరించింది. తనపై అభిమానంతో చిత్రపటం గీసి బహుకరించిన నామల ప్రవళికను ఎమ్మెల్యే అభినందించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 97051 35557
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 95539 55603
జోగులాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com